రేపు ట్రస్మా ప్రధాన సమావేశం

గోల్నాక, జనవరి 6 : తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ప్రధాన సమావేశం నిర్వహిస్తున్నట్లు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాధుల మధుసూదన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.రమేశ్‌రావు, రాష్ట్ర కోశాధికారి పి.రాఘవేందర్‌రెడ్డి తదితరులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న బుధవారం పటాన్ చెరు ఎస్వీఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, గౌరవ అతిథులుగా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు వేమ నరేందర్‌రెడ్డి, ఎన్. రాజేందర్‌రెడ్డి, కె.నారాయణరెడ్డి, రాంచంద్రనాయక్‌తో పాటు ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు హాజరవుతున్నారని వారు తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యంగా విద్య, పాఠశాలల నిర్వహణ, తెలంగాణలోని విద్యారంగంపై ప్రభావం చూపుతున్న ప్రస్తుత విధానాలు తదితర అంశాలతో పాటు రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు విస్తృత స్థాయి చర్చ నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.

బీసీ రిజర్వేషన్ల పెంపునకు చర్యలు చేపట్టాలి

కాచిగూడ, జనవరి 6 : తెలంగాణలో గ్రామ పంచాయతి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కులాల వారీగా తక్షణమే చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం నింబోలిఅడ్డాలో ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో చేర్చిన బీసీల డిమాండ్‌లను అమలు చేయాలని కోరారు. విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లను 25 శాతం నుంచి 52 శాతానికి పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

షాహినాత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా రవీందర్

ఆబిడ్స్, జనవరి 6 : షాహినాత్‌గంజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నాగం రవీందర్‌ను నియమిస్తూ నగర పోలీస్ కమమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన బాబు చౌహాన్ బదిలీ కావడంతో స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న రవీందర్‌ను నియమించారు. 2004 బ్యాచ్‌కు చెందిన నాగం రవీందర్ గత సంవత్సరం షాహినాత్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి ఎన్నికల సందర్భంగా బదిలీ అయ్యారు. ఉన్నతాధికారులు తిరిగి రవీందర్‌ను ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యతను ఇస్తూ అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు.

మాతృభాషకు పట్టం కట్టడం హర్షణీయం

తెలుగు యూనివర్సిటీ, జనవరి 6 : బతుకుదెరువు కోసం మలేషియాకు దశాబ్దాల క్రితం వలస వెళ్లిన తెలుగు ప్రజలు భాషతో పాటు సంస్కృతిని, కళలను పరిరక్షించుంటూ భావితరాలకు మనవారసత్వ సంపదను అందించడం ముదావహమని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రశంసించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ తెలుగు మహాసభలలో మలేషియా తెలుగు సంఘం కళాకారులు చిరుతల భజన, దాటు భజన ప్రదర్శనలు, విద్యార్థులు అన్నమయ్య కీర్తనలు, పోతన భాగవత పద్యాలను గానం చేసి తెలుగుభాషలోని మాధుర్యాన్ని సభికులకు పంచి కరతాళధ్వనులందుకున్నారు. మలేషియా తెలుగు సంఘం సలహాదారు ప్రముఖ వైద్యులు డాక్టర్ అచ్చయ్య కుమార్ రచించిన అలలు ఎత్తిన కలల ప్రపంచం తెలుగు పుస్తకం, మలేషియాలో పూర్వికుల జీవన స్థితిగతుల-ఆర్థిక పురోగతిపై రచించిన ఆంగ్ల పుస్తకాన్ని ఈ సందర్భంగా వెంకయ్యనాయుడుతో పాటు సాహితీవేత్తలకు అందజేశారు. మలేషియా తెలుగు సంఘం అధ్యక్షులు డాక్టర్ వెంకట ప్రతాప్ మాట్లాడుతూ.. తెలుగు భాషా సంస్కృతులకు మలేషియాలో తెలుగు ప్రజలు పెద్దపీటవేస్తున్నారని తెలిపారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సహకారంతో తెలుగు భాషలో విద్యాబోధన పరీక్షల నిర్వహణ మలేషియాలో చేపట్టడం జరుగుతుందన్నారు. తెలుగు పండుగలను ఐకమత్యంతో జరుపుకొని ఇతర దేశస్తులకు మార్గదర్శకంగా తమ సంఘం నిలుస్తుందని పేర్కొన్నారు. తెలుగు సభలలో పాల్గొనేందుకు 110మంది సభ్యుల బృందం నగరానికి వచ్చామని ఆయన వెల్లడించారు. సంఘం ఉపాధ్యక్షులు సత్యసుధాకర్, సహాయ అధ్యక్షులు వీరలక్ష్మి, సురేశ్‌నాయుడు, కార్యదర్శి శివసూర్యనారాయణ, కోశాధికారి శశికళ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పుస్తకాలను వెంకయ్యనాయుడుకు బహూకరిస్తున్న సభ్యులు

మలేషియా తెలుగు సంఘం సభ్యుల బృందం

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వాహనదారునికి అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది

కాచిగూడ, జనవరి 6: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ.. క్షేమంగా ఇంటికి వెళ్లాలని కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. సోమవారం నింబోలిఅడ్డాలో స్పెషల్ డ్రవ్ నిర్వహించి హెల్మెట్ వాడకం, రాంగ్‌రూట్, పెండింగ్ చలాన్లపై వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు తమ రక్షణ కోసం తప్పకుండా హెల్మెట్‌ను ఉపయోగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను రూపుమాపే దిశగా యువత బాధ్యతగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

భారతీయ సినిమాకు శ్యామ్ బెనగల్ సేవలు మరిచిపోలేం

ప్రముఖ భారతీయ చిత్ర దర్శకులు,ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి శ్యామ్ బెనగల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నిజాం కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ తదితరులు

సుల్తాన్‌బజార్, జనవరి 6 : భారతీయ సినిమాకు, సాంస్కృతిక రంగానికి ప్రముఖ భారతీయ చిత్ర దర్శకులు, ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి శ్యామ్ బెనగల్ చేసిన సేవలను ఎన్నటికీ మరిచిపోలేమని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ కొనియాడారు. సోమవారం నిజాం కళాశాలలో ఓయూ పూర్వ విద్యార్థి శ్యామ్ బెనగల్ స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతీయ చిత్ర దర్శకులుగా శ్యామ్ బెనగల్ సినిమా రంగానికి ఎనలేని సేవ చేశారని అన్నారు. సామాజిక అంశాలపై ఆయన తీసిన సినిమాలు ఎంతో ప్రభావితం చేశాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నిజాం కళాశాల పూర్వ విద్యార్థి అనిష్ కురివిల్ల, గౌరవ అతిథి రాజా కార్తికేయ మాట్లాడుతూ శ్యామ్ బెనగల్ తీసిన సినిమాలపై విద్యార్థులు విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్ర మంలో అజయ్ శ్రీ భాషన్, నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.ఉపేందర్ రెడ్డి, అకాడమిక్ కో ఆర్డి నేటర్ డాక్టర్ ఎస్. రేణుక, కళాశాల పీఆర్‌వో డాక్టర్ కవిత షిండేతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టింగ్ ఆర్డర్లను ప్రకటించాలని జేఎల్ అభ్యర్థుల నిరసన

సుల్తాన్‌బజార్, జనవరి 6 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన 1392 మంది జూనియర్ లెక్చరర్ అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లతో పాటు పోస్టింగ్ ఆర్డర్లను వెంటనే ప్రకటించాలని నాంపల్లిలోని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కార్యాలయం ఎదుట సోమవారం జేఎల్ అభ్యర్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 14 సంవత్సరాల అనంతరం 2022లో నోటిఫికేషన్ రావడం జరిగిందని అన్నారు. 2023లో పరీక్ష నిర్వహించగా 2024 నవంబర్‌లో ఫలితాలను ప్రకటించారని, ఫలితాలు ప్రకటించి రెండు నెలలకు పైగా కావస్తున్నా ఇంత వరకు వివిధ కారణాలతో అపాయింట్‌మెంట్ ఆర్డర్లను రాష్ట్ర ప్రభుత్వం అందజేయలేదని వారు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని తక్షణమే 1392 మంది జూనియర్ లెక్చరర్‌లకు పోస్టింగ్ ఆర్డర్‌లను ఇవ్వాలని కోరారు.

నాంపల్లిలోని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కార్యాలయం ఎదుట సోమవారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపడుతున్న జేఎల్ అభ్యర్థులు

కులగణన చేపట్టడం రాజ్యాంగ బద్ధం కాదు

కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న జాతీయ అధ్యక్షుడు రమేశ్‌బాబు, రాజలింగం, కృష్ణ, శ్రీకాంత్

కాచిగూడ, జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపడితే రాజ్యాంగ బద్ధం కాదని, కేంద్ర ప్రభుత్వానికే అధికారాలు ఉంటాయని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేశ్‌బాబు అన్నారు. సోమవారం ఎస్సీ వర్గీకరణను రాజ్యాంగబద్ధంగా చేయాలని కోరుతూ సోమవారం ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్‌అక్తర్‌ను జాతీయ మాలమహానాడు ప్రతినిధులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కులాల్లో ఏ కులానికి అన్యాయం జరిగినట్లు నిరూపణ కాలేదని అన్నారు. శాస్త్రీయ తలేని ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు కోండ్ర రాజలింగం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వకిలి కృష్ణ, కార్యదర్శి ఎ.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నర్సమ్మ సంస్మరణ సభ

కాచిగూడ,జనవరి 6: రాష్ట్ర సాధన కోసం పొత్కల నర్సమ్మ అందించిన సేవలు చిరస్మరణీయమని గోల్నాక మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ అన్నారు. గోల్నాక డివిజన్ అశోకనగర్‌లో ఏర్పాటు చేసిన నర్సమ్మ సంస్మరణ సభలో పాల్గొని నర్సమ్మ చిత్రపటానికి ఆమె బీఆర్ఎస్ నాయకులు పడకంటి అంజయ్యచారి, ప్రభాకర్ముదిరాజ్, పొత్కల శ్రీనివాస్, పొత్కల సంతోశ్, ఉద్యామకారులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.

సన్మానం

తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐఖ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ ఉక్కుల ఆధ్వర్యంలో సోమ వారం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ బి.వెంకటేశ్వర్‌రావుని, తెలంగాణ మెడికల్ అండ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షుడు కె. శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంద మహేందర్, నాగార్జున, శ్రీనివాస్, సయ్యద్ అబ్దుల్ కవి తదితరులు పాల్గొన్నారు. – సుల్తాన్‌బజార్, జనవరి 6

లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలి

ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడానికి విద్యార్థులు కృషి చేయాలని మౌంట్ ఫోర్ట్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎడ్వర్డ్ రాజ్ తెలిపారు. ఆదివారం సరూర్‌నగర్‌లో జరిగిన ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు పాల్గొని పలు అవార్డులు సాధించారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయక్ బూడోకాన్ కరాటే అకాడమీ ఫౌండర్, అధ్యక్షుడు గణేశ్‌నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

– చార్మినార్, జనవరి 6

క్రీడల్లో ప్రతిభ చాటడం హర్షించదగ్గ విషయం

విజేతలకు బహుమతులను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఆబిడ్స్, జనవరి 6 : వీర్‌లోధేశ్వర్ రేజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు ధూల్‌పేటలోని మినీ స్టేడియంలో వీర్ బజరంగ్ కేసరి-2025 పేరుతో ఘనంగా జరిగాయి. ప్రధాన విభాగంలో సుస్మిత్‌సింగ్ అసాధారణ నైపుణ్యంతో వీర్‌బజరంగ్ కేసరిగా ఉద్భవించారు. జూనియర్ విభాగంలో అరవింద్ అద్భుతమై ప్రతిభతో బాలకేసరి 2025 టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ కార్యక్రమాన్ని హెచ్.పర్వేశ్ సింగ్ పహిల్వాన్ నిర్వహించారు. బజరంగ్ సేనా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ సురానా, భజరంగ్‌సేనా సలహాదారు వినయ్ తివారీ, అభినయ్ తివారీ, ప్రభు, రవి, శైలేశ్‌సింగ్, ప్రవీణ్‌యాదవ్, నరేశ్, రామేశ్వర్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

'చిత్రపురి' బాధితులకు అండగా ఉంటాం

● ఆ కమిటీని రద్దుచేసి అడహాక్ కమిటీని ఏర్పాటు చేయాలి

అఖిల పక్ష సమావేశంలో మాట్లాడుతున్న దిడ్డి సుధాకర్

రవీంద్రభారతి, జనవరి 6 : మణికొండ చిత్రపురి కాలనీ, డా. ఎం ప్రభాకర్‌రెడ్డి సినీ వర్కర్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని, ఆ కమిటీని రద్దు చేసి అడహక్ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. సోమవారం బషీర్‌బాగ్‌లో జరిగిన అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు ఆమ్‌ఆద్మీపార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్ అధ్యక్షత వహించగా సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీజీ నరసింహారావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శరణ్‌కౌశిక్‌యాదవ్, టీజేస్ నాయకులు నర్సయ్య, సీనియర్ రాజకీయ నాయకులు దేశ్‌పాండే పాల్గొని ప్రసంగించారు. దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ..చిత్రపురి బాధితులకు అండ గా ఉండడటమే కాకుండా అవినీతి అధికారుల భరతం పడుతామన్నారు. చరణ్‌కౌశిక్‌యాదవ్ మాట్లాడుతూ.. చిత్రపురి బాధితులకు అండగా ఉంటామని , అవినీతిపై ప్రభు త్వం దృష్టికి తీసుకువెళుతామని పేర్కొన్నారు. సీపీఐ కార్యవర్గ సభ్యులు డీజీ నరసింహారావు మాట్లాడుతూ.. ఎర్ర జెండా చిత్రపురి బాధితులకు అండగా ఉంటుందని, చిత్రపురి అక్రమాలను అరికట్టే వరకు సీపీఐ బాధితుల పక్షాన ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్.బాలరాజు, సుంకరి రవీందర్, కస్తూరి శ్రీనివాస్, శ్యాంరావ్, రమావేణి, రాజు, కాంట్రాగడ్డ రవితేజ, మద్దినేని రమేశ్, బాధితులు నిర్మల, పద్మావతి, ఆప్ నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మసీదులకు అయ్యప్ప స్వాములు వెళ్లడం అపచారం

అబిడ్స్, జనవరి 6 : శబరిమలై వెళ్లే మార్గంలో ఉన్న వావర్ మసీదుకు అయ్యప్ప స్వాములు వెళ్లకూడదని అయ్యప్ప దర్శనానికి వెళ్లే మాలదారులకు గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రాకేశ్, కోశాధికారి సీఏ అనిల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో శబరిమలైలోని నీలక్కల్ మార్గ మధ్యంలో ఏర్పాటు చేయనున్న అన్నదాన సరుకుల లారీని ఆయన జెండా ఊపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అయ్యప్పలు నిష్టగా మాల వేసి 41 రోజులు దీక్ష చేసి సమాధి ఉన్న మసీదులోకిళ్లే అయ్యప్ప స్వామికి అపచారం చేసిన వారవుతారని ఆయన పేర్కొన్నారు. వావర్ మసీదుకు వెళ్లాలని తప్పుడు ప్రచారం చేశారని, ఇది కుట్రలో భాగమన్న విషయం అయ్యప్ప స్వాములు గ్రహించాలని ఆయన అన్నారు. అయ్యప్ప మాలదారులు నేరుగా శబరిమలైకి వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాస్ అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ శబరిమలైలోని నీలక్కల్‌లో 7వ తేదీ నుంచి 14 తేదీ వరకు అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. శబరిమలైకి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా వెళ్తారని, ఇద్దరు ముఖ్యమంత్రులు కేరళ ప్రభుత్వంతో మాట్లాడి అయ్యప్ప స్వాముల కోసం పదిఎకరాల భూమిని తీసుకుని స్వాముల కోసం భోజనం, వసతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సీఏ అనిల్‌కుమార్, కార్పొరేటర్ జి. శంకర్‌యాదవ్, రాకేశ్ జైస్వాల్, రాజు మహారాజ్, విజయ భాస్కర్, విజయేందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, వేణు, శ్రీహరి, భిక్షపతి, జగదీశ్‌గుప్తా, అశోక్, రాఘవేందర్, కాటిపల్లి రాజు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఉస్మాన్‌గంజ్ కార్యాలయం వద్ద శబరికి వెళ్లే నిత్యావసర సరుకుల లారీని జెండా ఊపీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే టి రాజాసింగ్, కార్పొరేటర్ జి. శంకర్‌యాదవ్

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

కాచిగూడ, జనవరి 6 : విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసినప్పుడే ఉద్యోగులకు మంచి గుర్తింపు ఉంటుందని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఈ.శ్రీధర్ అన్నారు. సోమవారం రాత్రి తుల్జాభవన్ కార్యనిర్వహణాధికారి ఎస్.అంజనారెడ్డి ఆధ్వర్యంలో కాచిగూడ తుల్జాభవన్‌లో దేవాదాయ, ధర్మదాయ శాఖ హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్, శ్రీమల్లికార్జున స్వామి దేవస్థానం(కొమరవెల్లి)కార్యనిర్వహణాధికారిగా పదవీ విరమణ చేసిన ఎ.బాలాజీకి ఉద్యోగ విరమణ అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమిషనర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా దేవదాయ, ధర్మాదాయ శాఖ గెజిటెడ్ ఉద్యోగులు తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొని బాలాజీ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురాకుల జ్యోతి, ఎంఎండీ కృష్ణవేణి, రామకృష్ణారావు, అంజనారెడ్డి, నరేందర్, కృష్ణమాచార్యులు, నిఖిల్, శంకర్, ఓంప్రకాశ్, శ్రీనివాస్‌శర్మ, పల్లవి, భాస్కర్, వెంకటరమణ, పార్వతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ తదితరులు

నూతన సంవత్సర శుభాకాంక్షలు

కోఠి ఈఎన్‌టీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఆనందాచార్య, ఆర్ఎంవో అనిల్‌కుమార్‌లకు సోమవారం టీఎన్జీవో ఈఎన్‌టీ దవాఖాన యూనిట్ అధ్యక్షుడు తూముకుంట రాజు, కార్యదర్శి సంతోష్ తివారి, కోశాధికారి భాస్కర్, ఉపాధ్యక్షుడు రవి బొకే శాలువాలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ఈఎన్‌టీ యూనిట్ సహ కార్యదర్శి దిలీప్, ఆఫీస్ సూపరింటెండెంట్ సునీల్,అశ్వత్ అలీ, ప్రవంతి, నిహారిక పాల్గొన్నారు.

– సుల్తాన్‌బజార్, జనవరి 6

క్రీడల్లో ప్రతిభ చాటడం హర్షించదగ్గ విషయం

విజేతలకు బహుమతులను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఆబిడ్స్, జనవరి 6 : వీర్‌లోధేశ్వర్ రేజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు ధూల్‌పేటలోని మినీ స్టేడియంలో వీర్ బజరంగ్ కేసరి-2025 పేరుతో ఘనంగా జరిగాయి. ప్రధాన విభాగంలో సుస్మిత్‌సింగ్ అసాధారణ నైపుణ్యంతో వీర్‌బజరంగ్ కేసరిగా ఉద్భవించారు. జూనియర్ విభాగంలో అరవింద్ అద్భుతమై ప్రతిభతో బాలకేసరి 2025 టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ కార్యక్రమాన్ని హెచ్.పర్వేశ్ సింగ్ పహిల్వాన్ నిర్వహించారు. బజరంగ్ సేనా అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ సురానా, భజరంగ్‌సేనా సలహాదారు వినయ్ తివారీ, అభినయ్ తివారీ, ప్రభు, రవి, శైలేశ్‌సింగ్, ప్రవీణ్‌యాదవ్, నరేశ్, రామేశ్వర్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి శవానికి పోస్ట్‌మార్టం

కాచిగూడ, జనవరి 6: ఓ వృద్ధురాలు కాచిగూడ పరిధిలో సోమవారం మరణించింది. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ వివరాల ప్రకారం.. ఖార్కానలైన్‌కు చెందిన బాలమ్మ(103) చిన్న కొడుకు యాదయ్య దగ్గర బాలమ్మ ఉంటుంది. ఐతే బాలమ్మ పెద్ద కొడుకు శబరిమలకు వెళ్లాడు. నాయనమ్మ చివరిచూపు చూడాలని పెద్ద కొడుకు నారాయణ కుమర్తెలు ఎంత చెప్పినా వినిపించుకోక అంత్యక్రియలు చేయడానికి చిన్న కొడుకు శ్మశానవాటికికు తీసుకెళ్లారు. వెంటనే మనవరాళ్లు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అనమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి బాలమ్మ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

అజంతా రైల్లో దొంగతనం

కాచిగూడ, జనవరి 6: అజంతా రైల్లో ప్రయాణికురాలి నగదు, బంగారు ఆభరణాలు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. అంకాపల్లికి చెందిన అంకమ్మ కాచిగూడకు వస్తుండగా ముత్‌కేడ్ రైల్వేస్టేషన్‌లో ఆమె బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అందులో 33 గ్రాముల బంగారుఆభరణాలు, రూ.5 వేలు ఉన్నట్లు తెలిపారు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

మరో ఘటనలో..

విశాఖపట్నంలోని దువ్వాడకు చెందిన హస్తికా ఏపీ సంపర్క్‌క్రాంతి రైలును హజ్రాత్‌నిజామొద్దీన్ రైల్వేస్టేషన్‌లో ఎక్కింది. అనంతరం చూసుకునేసరికి ల్యాప్‌ట్యాప్ కన్పించలేదు. సోమవారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని హజ్రాత్‌నిజామొద్దీన్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పాలీసులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అత్మీయ సమ్మేళనం



అత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న జియాగూడ భారత అభ్యుదయ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

అబిడ్స్, జనవరి 6 : జియాగూడ భారత అభ్యుదయ ఉన్నత పాఠశాలలో 1998-99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల అత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల వ్యవస్థాపక ట్రస్ట్ సభ్యులు కమల్ ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్, ఉపాధ్యాయులు శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, కిషన్‌జీ, చంద్రశేఖర్, వినోద్‌కుమార్ హాజరై పూర్వవిద్యార్థులు మామిడి కేశవ్, జె. లక్ష్మీనారాయణ, సుష్మ, బి. శ్రీనివాస్, హైమావతి, శకుంతల, ప్రసన్నలతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పదవ తరగతి చదివి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తరువాత ఒకరినొకరు పలకరింపులతో అహ్లాదకరమైన వాతావరణంలో గడిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు తమ మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి మాట్లాడుతూ..తమ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థ